పెట్టుబడి వరదపాలు


మాడిపోయిన పత్తిపంటను చూపిస్తున్న కోరవేన రవి

ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు కోరవేన రవి. ఇతనిది మంథని మండలం విలోచవరం గ్రామం. గోదావరినది సమీపంలో ఇతనికి ఉన్న ఎకరంన్నర భూమిలో పత్తి పంట సాగు చేశాడు. ఎకరానికి రూ.25వేల నుంచి రూ.30వేల వరకు పెట్టుబడి పెట్టాడు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు గోదావరి నదికి వరద ఉధృతి పెరిగి సమీపంలోని పంటలు మునిగిపోయాయి. వరదలో రవికి చెందిన ఎకరంన్నర పత్తి సైతం మునిగిపోయింది. రెండురోజులు వరద నీటిలో మునిగిన పత్తి పంట నీళ్లు తగ్గగానే నల్లగా మాడిపోయింది. ఇలా ఒక రవికి చెందినదే కాకుండా నదితీరంలో పత్తిసాగు చేసిన రైతులకు దుఃఖమే మిగిలింది.


పోతారం శివారులో నల్లగా మారిన పత్తి పంట

- మూడురోజులు నీట మునగడంతో మాడిపోయిన పత్తి
- వంద ఎకరాల పంటను ముంచిన వరద
- ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్న అన్నదాతలు

మంథనిరూరల్: పత్తి పంట సాగు చేసిన రైతులను వరదలు నిండా ముంచాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఎగువ నుంచి గోదావరి నదిలోకి చేరిన భారీ వరదతో మంథని మండలంలోని గోదావరినది పరీవాహక ప్రాంతంలోని పంటపొలాలు మునిగిపోయాయి. ముఖ్యంగా పత్తి పూర్తిగా దెబ్బతింది. నిన్న మొన్నటి వరకు పచ్చగా ఉన్న పత్తి చేను వరదలో మునిగి నల్లగా మాడిపోవడంతో అన్నదాతలు కన్నీటి పర్యంతమవుతున్నారు.

150కిపైగా ఎకరాల్లో పత్తి పంట..

గోదావరి నది వరదతో పరీవాహక ప్రాంతంలోని సుమారు 150కిపైగా ఎకరాల్లో పత్తి పంటకు నష్టం జరిగిందని రైతులు చెప్తున్నారు. మంథని మండలం పోతారం, విలోచవరం, ఉప్పట్ల గ్రామాల్లో పత్తి పంట మూడురోజులు నీటిలో మునిగి ఉంది. వరద ఉధృతి తగ్గి తేలిన పత్తి మొక్కలు నల్లగా మాడిపోయాయి. దీంతో ఇక పంట చేతికి రాకుండా పోయిందని రైతు ఆందోళన చెందుతున్నాడు.

ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి

ఎకరానికి రూ.30వేల పెట్టుబడితో సాగు చేసిన పత్తి పంట పూర్తిగా నాశనమైందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. పోతారం, విలోచవరం, ఉప్పట్ల గ్రామాలకు చెందిన రైతులు తీవ్రంగా నష్టపోయారని, అధికారులు వెంటనే సర్వే చేసి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలె



నేను ఎకరంన్నరలో, నా బిడ్డ రెండెకరాల్లో పత్తి పంట సాగు చేసినం. ఎకరానికి .30వేల దాకా పెట్టుబడి పెట్టినం. మంచిగా చెట్లన్నీ పెరిగినయ్. మొన్న వరద వచ్చి ఇద్దరి పత్తి పంట మునిగింది. నీళ్లు పోయినంక చూస్తే ఒక్క చెట్టు అక్కరకు రాకుండా నల్లబడిపోయింది. ప్రభుత్వం సాయం చేసి ఆదుకోవాలె.

– జనుగరి శారద, పోతారం

వరద ముంచింది



ఎకరం భూమిలో పత్తి పంట సాగు చేసిన. మంచిగా ఏపుగా పెరిగితే దిగుబడి వస్తుందని ఆశపడ్డా. నా ఆశలన్నీ నీరు గారిపోయినయ్. పత్తి పంటను వరద ముంచింది. రెండు, మూడు రోజులు నీళ్లలో ఉండటంతో మొత్తం మాడిపోయింది. పెట్టిన పెట్టుబడి మొత్తం వరద పాలైంది.

– రంగు నాగరాజు, విలోచవరం

క్లుప్తంగా

రైతుల గోస పట్టని కాంగ్రెస్ ప్రభుత్వం


మాట్లాడుతున్న హరీశ్‌రెడ్డి

గోదావరిఖని: రాష్ట్రంలో రైతులు యూరియా కొరతతో ఇబ్బంది పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వ్యాళ్ల హరీశ్‌రెడ్డి ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా కొరతతో రైతులు ఆత్మహత్య చేసుకుంటుంటే, స్థానిక ఎమ్మెల్యే నాకేంటి అనడం విడ్డూరంగా ఉందన్నారు. రామగుండంలో అరాచకపాలన సాగుతోందని, ఇసుక, మట్టి, బూడిద దందాలు నడుస్తున్నాయని, అడ్డు చెప్పిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. రామగుండం కార్పొరేషన్ కమిషనర్ ఇటీవల అనధికార ఫ్లెక్సీలను పెట్టొద్దని ప్రకటన విడుదల చేశారని, కానీ గణేశ్ నిమజ్జనం వేడుకల్లో స్థానిక ప్రధాన చౌరస్తాలో అధికార పార్టీకి చెందిన ఫ్లెక్సీలు పెట్టడం వెనక అంతర్యం ఏంటని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు ఐత శివకుమార్, తస్లీమ్‌భాను, జహీద్ పాషా, కృష్ణస్వామి, బూరుగు వంశీకృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సు విజయవంతం చేయండి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో 7న చేపట్టిన రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ పిలుపునిచ్చారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి రాష్ట్ర సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చేపట్టనున్న రాష్ట్ర సదస్సులో అన్ని సెక్షన్ల కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. లింగయ్య, శారద, మేరీ, మధునమ్మ, లక్ష్మీ, మల్లీశ్వరి, సుజాత, రాములు, బాబు పాల్గొన్నారు.

దళితులకు న్యాయం అందేలా చూడాలి


వినతిపత్రం అందిస్తున్న కౌశిక హరి, రాకేశ్

జ్యోతినగర్: ప్రభుత్వంలో జవాబుదారీగా ఉండే అధికారి దళితులతో అనుచితంగా ప్రవర్తిస్తూ అవమాన పరుస్తున్నారని, దళితులకు న్యాయం అందేలా చూడాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కౌశిక హరి, బాధితులు మంచినీళ్ల రాకేశ్, సంతపురి వెంకటేశ్ జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచెందర్‌కు వినతిపత్రం అందించారు. ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్ జ్యోతిభవన్‌లో శనివారం ఆయనను కలిసి వినతిపత్రం అందించి మాట్లాడారు. పాలకుర్తి మండలం పుట్నూరుకు చెందిన మంచినీళ్ల రాకేశ్ అనే దళిత యువకుడు, డీజే నిర్వాహకుడిని బైండోవర్ పేరుతో పిలిచి ఇష్టం ఉన్నట్లు చితకబాదడంతో పాటు దూషించారు. తక్కళ్లపల్లికి చెందిన సంతపురి వెంకటేశ్‌ను బంగారం చోరీ కేసులో అనుమానితుడిగా తీసుకెళ్లి కేసు చేశావని ఒప్పుకోవాలని ఒత్తిడి చేసిన విషయాలపై బసంత్‌నగర్ ఎస్సై స్వామిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. చేయని నేరాన్ని అంగీకరించాలని ఒత్తిడి చేయడం, ఇంటరాగేషన్ పేరుతో గుడ్డలు ఊడదీసి కొట్టడాన్ని తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఆయన పేర్కొన్నారు. పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

మంథని: పేద మధ్యతరగతి ప్రజలపై భారం పడకుండా కేంద్రం జీఎస్టీ తగ్గించడం హర్షణీయమని బీజేపీ మంథని నాయకులు అన్నారు. మంథని ప్రధాన చౌరస్తాలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు సబ్బని సంతోష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొండపాక సత్యప్రకాశ్, రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి పూసల రాజేంద్రప్రసాద్, జిల్లా కౌన్సిల్ మెంబర్ బోగోజు శ్రీనివాస్, అసెంబ్లీ కోకన్వీనర్ నాంపల్లి రమేశ్ పాల్గొన్నారు.

• నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి శివారు రంగంపల్లి, మండలంలోని పెద్దకల్వలలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వైభవంగా కోటివత్తుల నోము


వ్రతంలో పాల్గొన్న దంపతులు


వత్తులు వెలిగిస్తున్న దంపతులు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని నీరుకుల్ల మానేటి రంగనాయకస్వామి ఆలయంలో అనంత పద్మనాభ కోటివత్తుల నోమును శనివారం వైభవంగా నిర్వహించారు. దాదాపు వందకు పైగా దంపతులు వ్రత నోమును ఆచరించారు. అనంతరం కోటి వత్తులు వెలిగించి మొక్కులు చెల్లించారు. ఈవో శంకరయ్య, మాజీ సర్పంచ్ విజేందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించండి

రామగిరి: ఆర్జీ–3 ఏరియాలో కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ కాంట్రాక్టు కార్మిక సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ జాగరి రజితయాదవ్ కోరారు. ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఓసీపీ–1 రద్దయిన టెండర్ త్వరగా టెండర్ పిలవాలని, ఆర్జీ–3 ఏరియాలోని నర్సరీలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులందరికీ సమాన వేతనం చెల్లించేలా చూడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికులకు సరైన సౌకర్యాలు కల్పించాలని, పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు.

• ప్రభుత్వ వైద్యుడిపై చర్యలు తీసుకోవాలి

జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ హాస్పిటల్‌కు వైద్యం కోసం వెళ్లిన రోగులతో దురుసుగా మాట్లాడడమే కాక వైద్యం చేయనని చెప్పిన మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని జూలపల్లికి చెందిన రోగి సత్యవ్వ కుమారుడు మహిపాల్‌రెడ్డి కోరారు. సత్యవ్వ, నిర్మల వైద్యం కోసం శనివారం ఆస్పత్రికి వెళ్లగా మూడు రోజుల క్రితమే వైద్యం చేశాను.. మళ్లీ ఎందుకు వచ్చారని గద్దించినట్లు ఆరోపించారు. ఈ విషయమై జిల్లా వైద్యాధికారి వాణిశ్రీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వైద్యం చేయాలని కోరితే విధులకు ఆటంకం కలిగిస్తున్నారని కేసు పెడతానని బెదిరిస్తున్నట్లు వాపోయాడు. ఉన్నతాధికారులు సదరు వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని సత్యవ్వ, నిర్మల, మహిపాల్‌రెడ్డి కోరారు.

• భూమి విరాసత్ చేయట్లేదు

కమాన్‌పూర్: తన తండ్రి పేరు మీద ఉన్న భూమిని తన తల్లి పేరుమీద విరాసత్ చేయకుండా తనను కమాన్‌పూర్ తహసీల్దార్ ఇబ్బంది పెడుతున్నారని మండలంలోని పేంచికల్‌పేట గ్రామానికి చెందిన ఇరుగురాల సంతోష్ ఆరోపించారు. మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన తండ్రి పేరు మీద ఉన్న భూమిని తల్లి పేరుమీద విరాసత్ చేయాలని దరఖాస్తు చేశానని తెలిపారు. విరాసత్ ఎందుకు చేయడం లేదని అడిగితే తమ భూమి పక్కన ఉన్న వారు అభ్యంతరం చెప్తున్నారంటూ జాప్యం చేస్తున్నారన్నారు. భూమి సర్వే చేయాలని కోరినా సర్వే చేయడం లేదని జాయింట్ కలెక్టర్, ఆర్డీవోకు ఫిర్యాదు చేసినా తహసీల్దార్ పట్టించుకోవడం లేదని సంతోష్ ఆవేదన వ్యక్తం చేశాడు.

• మహిళలు ఆర్థికంగా ఎదగాలి

కమాన్‌పూర్: కుట్టుశిక్షణతో మహిళలు ఆర్థికంగా ఎదగాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.ఎస్.అన్వర్ ఆకాంక్షించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు మండల కేంద్రంలో గ్రామ స్వరాజ్య సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. గ్రామ స్వరాజ్య సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ధనలక్ష్మి, మండల కోఆర్డినేటర్ కుమ్మరి సవిత, ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు, ఎంపీడీవో లలిత, నాయకులు ఇనగంటి రామరావు, రంగు సత్యనారయణ, కిషన్‌రెడ్డి, అంబీరు శ్రీనివాస్, ముస్తాక్, మల్యాల మహేశ్ ఉన్నారు.

• ఆర్థికసాయం అందజేత

కాల్వశ్రీరాంపూర్: తెలంగాణ ఉద్యమకారుడు పాలకాని కనుకయ్య (68)ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి తెలంగాణ ఉద్యమకారులు తలో కొంత పోగుచేసి రూ.10వేలు అందించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య, అశోక్‌పటేల్, బత్తుల శంకర్, ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, జనగామ రవి, దబ్బెల చంద్రకళ, సిల్వేరి సుధాకర్, సదాశివ పటేల్, రామ్‌నేని కుమారస్వామి, రాజవీరు పాల్గొన్నారు.

• నిజాయితీ చాటుకున్న కానిస్టేబుల్

గోదావరిఖని: దొరికిన పర్సును బాధితునికి అప్పగించి కానిస్టేబుల్ నిజాయితీ చాటుకున్నారు. గణేశ్ నిమజ్జన సమయంలో పోలీస్ కానిస్టేబుల్ సతీశ్‌కు రోడ్‌పై పర్సు దొరికింది. అందులో ఉన్న ఫోన్‌నంబర్ ఆధారంగా వివరాలు తెలుసుకుని పర్స్ పోగొట్టుకున్న బాధితుడు శ్రావణ్‌కుమార్‌ను సీఐ ఇంద్రసేనారెడ్డి పోలీస్‌స్టేషన్‌కు పిలిపించాడు. కానిస్టేబుల్ సమక్షంలో పర్సు అందజేశాడు. అందులో రూ.1500 నగదు, బ్యాంకు కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్‌కార్డు ఇతర విలువైన కాగితాలున్నాయన్నారు. కానిస్టేబుల్‌ను సీఐ అభినందించారు.

• రోగులకు పండ్ల పంపిణీ

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి పండ్లు పంపిణీ చేశారు. మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకొని శనివారం ఆలంగీర్ మజీద్‌లో మజీద్ కమిటీ అధ్యక్షుడు యూసుఫ్ అలీ బేగ్ (పుచ్చు) ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, నాయకులు అబ్దుల్ గోరే, ఎండీ వసీం, ఆసిఫ్, ఎండీ బాబర్, నయీం, సాజిద్, మేరాజ్, అతిక్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

• గురు పూజోత్సవం

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని మండల ప్రజాపరిషత్ పాఠశాలలో శనివారం గురు పూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులను విద్యార్థులు సత్కరించారు. విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా ఉపాధ్యాయులు అనుసరిస్తున్న బోధన పద్ధతులను హెచ్‌ఎం వివరించారు.

బీఆర్ఎస్‌లో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోరుకంటి చందర్

గోదావరిఖని: పాలకుర్తి మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన పలువురు నాయకులు శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. స్థానిక తిలక్‌నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నివాసంలో జరిగిన కార్యక్రమంలో పార్టీలో చేరిన నాయకులకు కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ నాయకులు నెరిమట్ల పెద్ద మల్లేశం నెరిమట్ల శ్రీనివాస్, నెరిమట్ల రాయపోషం, మిట్ట రాజయ్య, తీగల స్వామి పార్టీలో చేరారు. నాయకులు మల్కల కొమురయ్య, శ్రీనివాస్, నారాయణదాసు మారుతి, శ్రీనివాస్, రాజన్న, హుస్సేన్ పాల్గొన్నారు.

కార్మికుల సొంతింటి కల అమలు చేయాలి

గోదావరిఖని: సింగరేణి యాజమాన్యం కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలనే డిమాండ్‌తో గనులపై చేపట్టే బ్యాలెట్ పోరాటంలో కార్మికులు పాల్గొనాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎర్రవల్లి ముత్యంరావు కోరారు. జీడీకే–2ఏ గనిపై శనివారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కార్మికులకు సొంతిల్లు పథకం అమలు చేస్తామని వాగ్దానం చేశారని, ఇప్పటివరకు పరిష్కరించలేదన్నారు. ఈనెల 11, 12 తేదీల్లో సింగరేణి వ్యాప్తంగా కార్మికుల అభిప్రాయ సేకరణ కోసం సీక్రెట్ బ్యాలెట్ ఉద్యమం చేపట్టిందన్నారు. నాయకులు ఆరెపల్లి రాజమౌళి, మెండె శ్రీనివాస్, తోట నరహరిరావు, అనబోయిన శంకరన్న, బూర్గుల రాములు, వంగల శివరాంరెడ్డి, జి.దుర్గాప్రసాద్, సీహెచ్ యాదగిరి, శివరామకృష్ణ, తుమ్మ లక్ష్మయ్య పాల్గొన్నారు.

నేత్రదానం మహాదానం

యైటింక్లయిన్‌కాలనీ: నేత్రదానం మహాదానమని సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి అన్నారు. నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ఆర్జీ–2 ఏరియా సెఫ్టీ మేనేజ్‌మెంట్ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో నేత్ర, శరీర, అవయవదానాలపై ఆయన అవగాహన కల్పించారు. నేత్రదానానికి ముందుకు వచ్చిన 16మంది సింగరేణి ఉద్యోగులకు డోనర్ కార్డులు అందజేశారు. ఏటీవో విశ్వనాథరెడ్డి, క్వాలిటీ మేనేజర్ సుభాష్, సతీశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి లడ్డూ వేలం డబ్బులు


నగదు అందజేస్తున్న పాఠశాల ప్రతినిధి

కోల్‌సిటీ: మూత్ర పిండాలు చెడిపోవడంతో దశాబ్దకాలంగా రక్తశుద్ధితో జీవనం సాగిస్తున్న నగరంలోని తిప్పని తిరుపతి అనే పూర్వ విద్యార్థికి రమేశ్‌నగర్‌లోని వాసవ్య స్కూల్ అండగా నిలిచింది. నవరాత్రి ఉత్సవాల్లో లడ్డూ కలశం వేలంతో రూ.6,500 వరకు డబ్బులు వచ్చాయి. శనివారం ఆ డబ్బులను పాఠశాల పూర్వ విద్యార్థి తిరుపతికి అందించారు. నీడ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, అయ్యప్ప గురుస్వామి అమ్మరాజు, వాసవ్య విద్యాలయం డైరెక్టర్ విక్రమ్ వర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మారుపేర్ల కార్మికుల పిల్లలకు ఉద్యోగాలివ్వాలి


మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు విఫలమయ్యాయని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థ వాస్తవ లాభాలు ప్రకటించి అందులో 35శాతం కార్మికుల వాటాగా చెల్లించాలని డిమాండ్ చేశారు. మారుపేర్ల కార్మికుల పిల్లలకు వెంటనే ఉద్యోగాలివ్వాలన్నారు. విజిలెన్స్ విచారణ పేరుతో కార్మికుల పిల్లలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ప్రతీనెల మెడికల్ బోర్డ్ నిర్వహించి, హాజరైన వారందరినీ మెడికల్ ఇన్వాలిడేషన్ చేయాలన్నారు. ఇటీవల నిర్వహించిన హయ్యర్ మెడికల్ బోర్డు రెఫరల్ కార్మికులను మళ్లీ పిలిచి ఇన్వాలిడేషన్ చేసి వారి పిల్లలకు ఉద్యోగాలివ్వాలన్నారు. సింగరేణి కార్మికుల సమస్యల సాధన కోసం అలుపెరగకుండా కృషి చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు రామ్మూర్తి, నూనె కొమురయ్య, పర్లపల్లి రవి, వడ్డేపల్లి శంకర్, జావిద్‌పాషా, సతీశ్ పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి సింగరేణి యాజమాన్యం కృషి


పోటీలను ప్రారంభిస్తున్న జీఎం వెంకటయ్య

గోదావరిఖని: సింగరేణి క్రీడాకారులు ఆటలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీల్లో రాణించాలని ఆర్జీ–2 జీఎం బి.వెంకటయ్య ఆకాంక్షించారు. స్థానిక అబ్దుల్‌కలాం స్టేడియంలో ఏరియా స్థాయి క్రీడా పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. క్రీడల అభివృద్ధి కోసం సింగరేణి యాజమాన్యం కృషి చేస్తోందన్నారు. డిపార్ట్‌మెంట్, రీజియన్, సింగరేణి స్థాయి పోటీల్లో క్రీడాకారులు తమ సత్తా చాటాలన్నారు. క్రీడల కోసం యాజమాన్యం ఎంతో ఖర్చు చేస్తోందని, ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్‌లో కార్మికులు రాణించేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తోందని పేర్కొన్నారు. ఉద్యోగాల్లో చేరిన యువ ఉద్యోగులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాముడు, పర్సనల్ డీజీఎం అరవిందరావు, ఐఈడీ ఏజీఎం మురళీకృష్ణ పాల్గొన్నారు.

అధికారులకు అభినందనలు


అభినందిస్తున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి: కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్వహించిన జాతీయ గనుల స్టార్ రేటింగ్‌లో భాగంగా 2023–24కి గాను రామగుండం–3 ఏరియాలోని ఓసీపీ–1 ఉపరితల గని ఫైవ్‌స్టార్ రేటింగ్ పురస్కారానికి ఎంపికైంది. ఈ పురస్కారాన్ని సెప్టెంబర్ 4న ముంబయిలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి చేతుల మీదుగా ఓసీపీ–1 మేనేజర్ రావులపాపయ్య అందుకున్నారు. ఈ మేరకు శనివారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ఓసీపీ–1 అధికారులను రామగుండం–3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు అభినందించారు. ప్రాజెక్ట్ ఇంజినీర్ ఉదయ్ భాస్కర్, మేనేజర్ రావుల పాపయ్య, పర్యావరణ అధికారి కిషన్, సేఫ్టీ ఆఫీసర్ అజయ్‌కుమార్, అధికారులు అశోక్ కుమార్, రమేశ్, నజీర్ అహ్మద్, ఫణీంద్ర పాల్గొన్నారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీల ఓటరు జాబితా ప్రదర్శన


పెద్దపల్లిరూరల్: ఓటరు జాబితాను నోటీసు బోర్డుపై ప్రదర్శిస్తున్న ఎంపీడీవో, తదితరులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓటరు జాబితాను శనివారం ఎంపీడీవో ఆఫీసులో నోటీసు బోర్డులో ప్రదర్శించారు. ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా ఈ ఓటరు జాబితాను నోటీసుబోర్డులో ఉంచినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 8లోగా కార్యదర్శి, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. అలాగే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలతో 8న మండలస్థాయి నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సుల్తానాబాద్: మండలంలో 13 ఎంపీటీసీ స్థానాలు, ఒక జెడ్పీటీసీ స్థానం ఉందని సుల్తానాబాద్ ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించిన ఓటరు జాబితా ముసాయిదా, పోలింగ్‌స్టేషన్ల వివరాలను మండల పరిషత్‌లో, గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఎంపీవో సమ్మిరెడ్డి, ఫక్రుద్దీన్, సాదిక్ పాషా, అలీ, రవీందర్ ఉన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కోసం తుది ఓటరు జాబితాను ఎంపీడీవో పద్మజ పంపిణీ చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంతో పాటు గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల నోటీసు బోర్డులో ప్రదర్శించారు. ఎంపీవో శేషయ్య సూరి, కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల వివరాలు, పోలింగ్ కేంద్రాలు, డ్రాఫ్ట్ ఓటరు జాబితా వివరాలను ఎంపీడీవో లలిత ప్రదర్శించారు. మండలంలో జెడ్పీటీసీ స్థానంతో పాటు ఏడు ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. 8న ఎంపీడీవో కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

గణపయ్యకు వీడ్కోలు


మంథనిలో ఆదిదేవుడి ఊరేగింపు


కల్వచర్లలో కౌండిన్య యూత్ ఆధ్వర్యంలో వేలంలో కలశం, లడ్డూ దక్కించుకున్న భక్తులు

మంథని: మంథనిలోని విశ్వబ్రాహ్మణులు తమ వృత్తి నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ విభిన్న రూపాల్లో తయారు చేసిన వాహనాల్లో ఆది దేవున్ని ఊరేగిస్తారు. 50ఏళ్లకు పైగా నవరాత్రులను నిర్వహిస్తున్న వీరు ఉత్సవాల ముగింపులో భక్తులను ఆకర్షించేలా వినాయకుడికి వీడ్కోలు చెప్తారు. కేదార్‌నాథ్ దామ్ నమూనాలో ప్రత్యేకంగా తయారు చేసిన సెట్టింగ్‌లో ఆదిదేవుని శోభాయాత్ర నిర్వహించారు. కాగా రెండో రోజు శనివారం మంథనిలో పెద్ద ఎత్తున గణనాథుడికి వీడ్కోలు పలికారు.

రామగిరి: మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన పలు విగ్రహాలను శనివారం నిమజ్జనానికి తరలించారు. నిమజ్జనం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నసంతర్పణ చేశారు. గ్రామాల్లోని పురవీధుల గుండా గణేషుని ఊరేగింపు నిర్వహించి మహిళల కోలాట నృత్యాలతో ఆటపాటలతో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.

రానున్న రోజుల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు


మాట్లాడుతున్న తాటికొండ శంకర్

కమాన్‌పూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని బీఆర్ఎస్ మండల కన్వీనర్ తాటికొండ శంకర్ ఆరోపించారు. మండలంలోని గుండారంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నా ప్రజలు నమ్మడం లేదన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్తారన్నారు. పుట్ట మధు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో గుండారంలో అనేక అభివృద్ధి పనులు చేశాడన్నారు. మాజీ జెడ్పీటీసీ మేకల సంపత్, మాజీ సర్పంచ్ ఆకుల గట్టయ్య, రాసకొండ చందు, గాదె సదయ్య, బోయిని బాలకృష్ణ, దండె కిషన్, రాసకొండ రవి, బొల్లపల్లి శంకర్‌గౌడ్, ఠాగూర్ పాల్గొన్నారు.